మూడు వారాల కథ

అనంతపురం నుంచి నారాయణపురం పోయే తోవలోని తపోవనంలో భాగీరథి అనే ఇల్లు వుంది.

అనంతపురం అనంతమైన పురమూ కాదు. అనంతుడి పురమూ కాదు. అనంతమ్మపురం. ప్రస్తుతం అక్కడక్కడా నీటి ఎద్దడి.

నారాయణపురంలో నారాయణుడూ లేడు. నరుడూ లేడు. రైతులు, కష్టజీవులు వున్నారు.



భాగీరథి గంగాకాదు. నీళ్లులేవు. ఆ ఇంట్లో నీళ్ల కావలసిన నోళ్లున్నాయి.

పొద్దు కూడేట్లో కుంకుతున్నపుడు వినాయక్ తవ్వే బావి అంచున నిలబడి లోపలికి చూడసాగాడు. చూచిన కొద్దీ చీకటి పెరుగుతూ వుంది. పొద్దు కుంకినట్లల్లా చీకటి దట్టమవుతూ వుంది. లోపల ఏమీ కనిపించలేదు.

ఏమీ కనబడకుండా పోయిందాకా చూచి, వెను దిరిగిన అతడి కళ్లల్లో తిరిగిన నీళ్లను కళ్లే మింగాయి. బావిలో నీళ్ల పళ్లేదు.

ఏమీ లేదన్న చోట ఏమయినా దొరుకు తుందేమోనన్న అశతో చూచే చూపు వినాయక్‌ది.

చీకటి పడిందని, ఇంట్లోకి రమ్మని చెప్పటానికి వచ్చిన పిల్లలు, మౌనంగా వున్న తండ్రిని చూచి, మాట్లాడకుండా లోనికి పోయారు.

అతను గుండె పట్టుకున్నాడు. హృదయ భారంగా వుంది.

మళ్లీమళ్లీ బావిలోకి చూశాడు. ఏముంది కనబడటానికి, మట్టి తప్ప. మట్టికాదు బండ. బావిలో బండ పడింది.

బావి తవ్వే గోవిందు బండ పడిందని అంతకు ముందే చెప్పి వెళ్లాడు. అయితే ఆశ చావలేదు. గోవిందు నమ్మకం గోవిందుది.

బండ పడిందన్న మాట విన్న వినాయక్ గుండె చెరువయింది. అందులోనూ నీళ్లు రావు. కాలనీలో బావులున్నాయి. వాటి నీళ్లు వాటివాళ్లకే చాలవు.

చాలినా వినాయక్‌ను తోడుకోనివ్వరు. తోడుకో నివ్వమనరు. అలా వుంటారు. పనివాళ్లు తోడితే రెండోమూడో కడవలు తోడుకోనిస్తారు. అవీ చాలవు. అయినా తోడదగ్గ వాళ్లు వినాయక్ ఇంట్లో ఎక్కువ కాలం పనిచేయరు. తెలియక చేస్తే చుట్టూ వున్న వాళ్లు తెలియజేస్తారు. నోటితో చెప్పరు. నొసటితో చెబుతారు. వాళ్లు పని మానుకుంటారు. పనివాళ్లేమో దొరుకుతారు. వీళ్లకు వాళ్ల బావుల్లో నీళ్లు తోడే అర్హత వుండదు. అర్హత వున్నవాళ్లూ దొరుకుతారు. ఎక్కువ కాలం వుండరు.

భాగీరథిలో నీళ్లకోసం ఆరుగోళ్లున్నాయి. తాగే నీళ్లే కష్టమైతే వాడే నీళ్లమాటే రాదు.

నీళ్లులేని చోట వుండటం ఎందుకు? వెళ్లిపోవచ్చు. కానీ పోలేదు. కారణం సొంతయిల్లు. జన్మకో శివరాత్రి. తనకంటూ ఎక్కడా యిల్లు లేని వాడికి సొంతిల్లు సొట్టదయినా, మొఱ్ఱిదయినా, తొఱ్ఱిదయినా, స్వర్గం. తన ఇల్లు. తన ఇంట్లో తానుండాలి. అంతేకాదు. తానక్కడే వుండాలి. అంతే. తన ఇంట్లో తానుండటమన్నది ఒక పోరాటం, అదృశ్య యుద్ధం. తానక్కడే వుండాలి. అదే తన విజయం. అదే తన తాపత్రయం.

తాను కాలేజీ నుంచి, తన భార్య స్కూలు నుంచి వచ్చేసరికి మసక చీకటి ముసురుకుంటుంది. స్కూళ్లనుంచి పిల్లలు కూడా అలసిపోయి వస్తారు. రెండు మైళ్లు నడిచి రావాలి. తనకు సైకిల్ అయినా

వుంది. మిగతా వాళ్లకదీ లేదు.

తాను పోలేక, భార్యను పంపలేక, పనిమనిషి లేక, పిల్లలకు కడవలు బిందెలు ఇచ్చి ఎక్కడ నీళ్లు దొరికితే అక్కణ్ణుంచి తెమ్మని పంపేవాడు వినాయక్. ఒక్కొక్కప్పుడు దొరికేవి, ఒక్కోసారి దొరికేవి కావు. అప్పుడు వాళ్లు అటు నారాయణపురమో, ఇటు అనంతపురమో

# గంగ

కొలకలూరి ఇనాక్



పోయిచి నీళ్లుతెచ్చేవాళ్లు. అంతపెద్ద కడవలు బిందెలు బరువుగా వాళ్లు మోసుకొని రావటం, చదువు బరువుతో అలసిపోయిన పసిప్రాణులు నలిగి పోవటం చూడలేని వినాయక్ సొంతబావి ఇంట్లో తవ్వించుకోవటం తప్పలేదు.

వాళ్ల జీతాలు అంతంతమాత్రం. అప్పటికింకా జీతాలు పెరగ లేదు. భార్యాభర్తలిద్దరికీ ముసలి తల్లిదండ్రులున్నారు. వాళ్లూ పేదవాళ్లు పల్లెల్లోనే వున్నారు. వాళ్లకూ ఎంతో కొంత పంపాలి. వాళ్లు చదువులేని వాళ్లు ఆస్తిపాస్తుల్లేవు. పిల్లల్నే సంపదగా పెంచుకొన్నారు. వాళ్లమీదే ఆధార పడ్డారు. వాళ్లు పల్లెలు వదల్లేరు. పట్నం రాలేరు. వచ్చి వుండలేరు. కలో గంజో పల్లెలోనే చాలం టారు. ఖర్చు దప్పదు. వాళ్లకు పంపగా మిగి లింది ఇంటికి సరిపోతుంది. నలుగురు పిల్లలు. ఎక్కిస్తున్నారు. చదువులు. వాళ్ల చదువులకు డబ్బు ఖర్చు పెరుగుతూ వుంది. వాళ్లు పెరుగుతున్నారు. తిండి, బట్టలు, చదువు ఖర్చు పెరు గుతూ వుంది. కాలం గడిచేకొద్దీ డబ్బు అవస్థగా వుంది.

దానికి తోడు ఇల్లు కట్టించుకోవటం. అదో ఖర్చు. తెచ్చిన అప్పు. నెలనెలా వడ్డీ. మొత్తం మీద డబ్బుకు కటకటగా వుంది.

ఆ పరిస్థితుల్లో బావి తవ్వించుకోవలసి వచ్చింది. ఖర్చు మీద ఖర్చు. బావిలో బండ పడింది. ఇంక నీళ్లు పడే ఆశ ఎండమావి.

బావిలో నీళ్లు పడతాయంటాడు గోవిందు. నీళ్లు పడితే బాగుండునని వినాయక్‌కూ ఆరాటం.

బండ పడితే ఏంచేయాలి. వినాయక్ అడుగుతున్నాడు. గోవిందు చెబుతున్నాడు. ఎందుకయినా డబ్బు కావాలి. తూటాలు పెట్టి పేలిస్తే బావిలో నీళ్లు పడతాయని నలుగురూ అన్నారు. బోరు వేయించినా మేలే అన్నారు. అదైనా ఖర్చే. అంత డబ్బు ఖర్చు చేయలేని పరిస్థితి వచ్చింది. తాత్కాలికంగా బావి పని ఆపాడు వినాయక్. పిల్లలకు నీళ్లు మోసే బరువు తప్పదు.

పది మంది పది రకాలుగా చెప్పారు. నీళ్లులేని బావి అనే గుంటను పూడ్చమన్నారు. అదొక ఖర్చు.

పిల్లలు తిరిగే చోటు. దాని మీద మూత వేయించమన్నారు. లేదా కాంపౌండు గోడ కట్టమన్నారు. కాదంటే బండలు పాతమన్నారు. అదీ ఖర్చే.

కొండలా పెరిగిన తవ్వకం మట్టిమీద పిల్లలు చేరి జారుతుంటే ఆ వూపులో వచ్చి వాళ్లు నీళ్లులేని బండ బడ్డ బావిలో పడితే లేనిపోని చావని భార్యాభర్త లిద్దరూ హడలి చస్తున్నారు. తమ పిల్లల్ని ఆపు తున్నారు. కాలనీ పిల్లల్ని ఆపటం వాళ్ల తరమా. రోజంతా ఇంట్లో ఎవరూ వుండరు. అప్పుడేమయినా పిల్లలకు జరిగితే? అదొక పోటు. తలనొప్పి.

దాన్ని పూడవనయినా పూడవాలి. లేదంటే తూటాలు పెట్టి బండయినా పగలగొట్టాలి. ఎందుకయినా డబ్బు కావాలి. అదే పెద్ద సమస్య. బావి దగ్గర తల పట్టుకొని నిలబడ్డ వినాయక్‌ను భాగీరథి వచ్చి ఇంట్లోకి తీసుకుని పోయింది.

ఆమె గోల ఆమెది. అందులో నీళ్లు పడతాయో లేదో, బండ పగులుతుందో లేదో, పగిలినా నీళ్లున్నాయో లేదో, వాటర్ డివైనర్ రాలేదు. చూడలేదు. తవ్వమని చెప్పలేదు. వినాయక్‌కు తోడు గోవిందు. ఇద్దరూ కూడబలుక్కున్నారు. ఇక్కడంటే ఇక్కడనుకుని తవ్వారు. ఏమయింది. నీళ్లు పళ్లేదు. బావి వాస్తు బాగా లేదు. అదొక సొడ్డు. అన్నింటికి మించి పూజ చేయించలేదు. పురోహితుడిని పిలవలేదు. దక్షిణం ఇవ్వలేదు. అయ్యవారికి దండం పెట్టుకోలేదు. బావి విషయమే కాదు. గృహప్రవేశమూ అంతే. ఎవరినీ పిలవ లేదు. అన్నం పెట్టలేదు. కనీసం ఫలహారం అయినా లేదు. పూజా పునస్కారాలు సరేసరి.

పాలు పొంగించి, బ్రూ కలుపుకొని, నలుగురూ తాగి, తోవన వస్తూపోతూ వున్నవాళ్లకు ఇంత ఇచ్చారు. తాగే వాళ్లు తాగారు. తాగని వాళ్లు తాగలేదు. తాగమని చెప్పకుండా,తాగకుండా,వెళ్లిపోయిన వాళ్ల చాకచక్యం చారిత్రకమయింది.

ఆచారాలు, సంప్రదాయాలు,పద్ధతులు, పూజా పునస్కారాలు రీతులు రివాజులు లేని మనిషి పని ఇంతేనని ఆడి పోసుకోవటం వినాయక్ వినకపోలేదు. పట్టించుకో లేదు. కానీ అన్నింటా అనుకూలవతి అయిన భార్య లోపల్లోపల కుమిలి పోవటం అతను గమనించక పోలేదు.

భూదేవి తల్లి వంటిది. తల్లి అన్నం పెడుతుంది. ఇల్లు ఇస్తుంది. నీళ్లిస్తుంది. పంట ఇస్తుంది. బ్రతుకిస్తుంది. తల్లికి కొడుక్కి మధ్య దళారులెందుకు? అందుకే గృహప్రవేశంలో దళారులు లేరు. బావి తవ్వకంలో దళారులు లేరు. పూజ పేరుతో సోమరుల్ని ప్రోత్సహించటం వినాయక్‌కు ఇష్టం లేదు.


భాగీరథి మౌనంగా వింటూ వుంది.

భూమితల్లి. తల్లి తనువు ఎక్కడ గిల్లినా నెత్తురు వస్తుంది. ఆ నెత్తురే ఈ నీరు. ఈ బావులు. ఈ పాతాళ గంగలు. ఎముక మీద పొడిచినా నెత్తురు రాకపోవచ్చు. అంతమాత్రాన తల్లి శరీరంలో నెత్తురు లేదనటం కుదరదు. తల్లి దయమాలి వుండదు. బిడ్డ దాహ బాధ మాన్పక మానదు. సంఘంలో పరాభవింపబడే కొడుకును చంక నెత్తుకోక ఆగదు, ఎవరికీ ఏ ద్రోహమూ చేయకపోయినా హింసించే లోకం లాగా కాక అక్కున చేర్చుకొంటుంది. ఆదరిస్తుంది. భయ పడనక్కర లేదు. బండ పగులుతుంది. బావిలో నీరు పడుతుంది. బావిలో నీరు పడకూడనంత ద్రోహం తానెవరికీ చేయలేదు.

భార్య వూపిరి బిగబట్టి వింటూ వుంది.

పూజ చేయించక పోవటమే బావిలో నీళ్లు పడకుండా బండ పడటానికి కారణమంటే హేతువు అంగీకరించదు. యిద్దరికీ వుద్యోగాలు రావటానికి, పిల్లలు కలగటానికి, పూజలు లేకపోయినా కరుణించిన శక్తి బావిలో నీళ్లు పడకుండా చేయదు. భార్య తల వూపింది.

కాలనీలో మనకు నీళ్లు పుట్టక పోవటానికి మనం కారణం కాదు. మన గతం. జాతి గతం. భారతీయత గతం. మనం ఇప్పుడు వేల పూజలు చేసినా మనకీ కాలనీలో నీళ్లు పుట్టవు. బావిలో పుడతాయి. ప్రయ




త్రించాలి. అంతే.

భాగీరథి భర్త చేయి పట్టుకుని లోపలికి తీసుకుపోయింది.

బావిలో బండ పడటం నిజంగా దురదృష్టమే. పూజ చేయించి, వాస్తు చూపించి, తవ్వినా పడే బండ పడనే పడుతుంది. మనకున్న స్థలం ఈ కొంచమే. ఇందులో ఎక్క డ తవ్వినా బండ వుండే వుండవచ్చు. మరో చోట మనం బావి కోసం స్థలం కొనలేం. తవ్వించలేం. మన స్థలంలో ఈ బావి కింద వున్న బండ చీలి నీళ్లు రావలసిందే. రెండు బండల మధ్య జల నిరంతరం వుంటుందంటారు. ఆ బావి ఎండి పోదు. వొట్టిపోదు. నీటి ఎద్దడి వుండదు. అనుభవం వున్న గోవిందు బండల మధ్య గంగా భవాని వుందంటాడు. అతడి మాట మీద అవిశ్వాసం లేదు. కష్టజీవి. అమాయకుడు, కల్లాకపటం లేనివాడు. పేదవాడు. గంగను నమ్ముకున్న వాడు. బావులు తవ్వటమే అతని జీవితం. నీళ్లులేని చోట తవ్వుకుంటూ పోడు. మోసం చేయడు. గంగ అతన్ని మోసం చేయదు.

'అన్నం వడ్డించేదా' అంది భార్య. 'సరే' అన్నాడు. ఆరుగురూ కూర్చున్నారు. ఎవరూ ఏమీ మాట్లాడలేదు. తండ్రి దిగులుగా ఉన్నాడని పిల్లలు మౌనంగా వున్నారు. భాగీరథి వడ్డిస్తూ వుంది.

అందరూ మౌనం పారిపోగొట్టటానికి వినాయక్ కల్పించుకున్నాడు. స్కూలు సంగతులు, ఆటలు, పాటలు, పోటీలు, మార్కులు మాయాజాలంలో పడ్డ పిల్లలు వసపిట్టల్లా ఒకటే కబుర్లు.

కోకిల కొసురు కూతల కంటే, బృహదీశ్వరాలయంలో పొద్దుటా, సాయంకాలం లౌడ్ స్పీకర్‌లో వినిపించే గీతోపదేశం కంటే, ఇష్టమైన జానపద గీతం కంటే పిల్లల మాటలు తండ్రి చెవులకు విందు చేశాయి. వాళ్ల మౌనం అతడికి నరకం. వాళ్ల మాటలు స్వర్గం. వినాయక్ ఎప్పుడూ స్వర్గసుఖాలే కోరుకొనేవాడు.

పిల్లలు అన్నం తింటున్నారు. వాళ్ల మాటల్లో వాళ్లున్నారు. వినాయక్ వాళ్ల మాటలు వింటూ అన్నం అంటుకొంటూ వున్నాడు. వాళ్ల మాటల రుచిలో అతను నెమ్మదిగా తనలోకి తాను వెళిపోయాడు.

రెండేళ్ల క్రితం తనకు చాలా పెద్ద కష్టం వచ్చింది. మంచం పట్టాడు. రెండు నెలలు లేవలేదు. నరకం అంటే ఏంటో తెలిసివచ్చింది. ఇంట్లో తాను ఒంటరిగా వుండేవాడు. మంచంలోంచి లేవలేదు. అన్నీ మంచంలోనే. పని చేసే మనిషి లేదు. భార్య స్కూలు మానటానికి వీలు లేదు. ఆమెతో పిల్లలూ మానేస్తారు. పిల్లల చదువుకు ఆటంకం కలగరాదు. వాళ్లు బాగా చదువుకోవాలి. తమ కంటే మంచి వుద్యోగాలు సంపాదించాలి. చదువు లేకపోతే, వుద్యోగం లేకపోతే, వాళ్ల




జీవితం దుర్భరంగా వుంటుంది. తమకు ఆస్తిపాస్తులు లేవు. పొలం పుట్రా లేదు. నగానట్రా శూన్యం. బాగా బతకాలంటే చదువుకోవాలి.

ఇలాగే ఈ మంచం మీదే, వీళ్లెవరూ స్కూలు నుంచి రాకముందే తాను చనిపోతే ఏమవుతుంది. ఏడుస్తారు. వల్లకాటికి అప్పగిస్తారు. అంతేనా, అంతేనా. అంతే అయితే ఫరవాలేదు. ఈ అయిదుగురూ ఏమవుతారు?

ఎవరాదుకుంటారు. ఆమె తల్లిదండ్రులు చేర దీయరు. బంధువులు రానివ్వరు. తన వాళ్లూ రానివ్వరు. రానిచ్చినా వాళ్లకేముంది. వీళ్లకేం పెడతారు. ఎలా బ్రతుకుతారు. వీళ్లకంటే ముందు వాళ్లు హరీ అంటారు. వాళ్లు వయస్సు మళ్లిన వాళ్లు. పోయినా న్యాయమే. యింకా కళ్లు తెరవని వీళ్లు. పసిగుడ్లు. లోకమంతా ముందున్న వాళ్లు. అన్యాయంగా... రామ రామ!

వినాయక్ ఆమెను ప్రేమించి పెళ్లాడాడు. కులం మతం చూసుకోకుండా పెళ్లి చేసుకున్నాడు. అమ్మా నాన్నా వద్దన్నా, అత్తామామలు బెదిరించినా పట్టించుకోలేదు. ఆమె కూడా అంతే తెగువ చూపించింది. వాళ్లెవళ్లూ తమ దగ్గరకు రారు. తమను రానివ్వరు. డబ్బు పంపితే తీసుకుంటారు. అది అభ్యంతరం లేదు. అది వాళ్ల హక్కు. వాళ్ల అవసరం. కొడుకుగానీ, కూతురు గానీ పెళ్లి చేసుకోవటం వాళ్లకంత అభ్యంతరం కాకపోయినా లోకం కోసం, పూరూవాడా కోసం, జనం కోసం హడలెత్తి చస్తుంటారు. ఇష్టమున్నా, వున్నట్లు కనిపించరు. వాళ్ల వల్ల లాభం లేదు. వాళ్లేమీ అదుకోలేరు. తాము సుఖంగా వుంటే వాళ్లూ సుఖంగా వుంటారు. లేకపోతే వాళ్లూ కష్టపడతారు. తాను లేకపోతే వాళ్లకూ వీళ్లకూ కష్టం.

తనకేమన్నాఅయితే తన భార్యాపిల్లల గతేమిటన్న ఆందోళన వినాయక్‌కు నిజంగా ఆయువు పోసింది. తాను పోయినా ఆమెకు వుద్యోగం వుంటుంది. వుండటానికి ఇల్లుంటే ఎంత బాగుంటుంది. ఎవరి పంచనా చేరవలసిన గతి పట్టదు. అపుడే ఆరాటం మొదలయింది. సొంతిల్లు. ఎంత చిన్నదైనా ఫర్వా లేదు. వుండాలి. ఈ ఆందోళన, ఆరాటం అతన్ని బ్రతికించాయి. బతికి బట్ట కట్టిన నాటి నుంచి సొంత యిల్లు అతడి వూపిరి అయిపోయింది.

పిల్లలు ఏమేమి కబుర్లుచెప్పారో అతను వినలేదు. ఎపుడు అన్నం తిన్నారో చూడలేదు. ఎపుడు పుస్తకాలు పుచ్చుకుని కూర్చున్నారో గమనించలేదు. తన గతంలో తాను కూరుకు పోయాడు. భార్య భోజనం ముగించి ప్లేటు తీసి శుభ్రం చేస్తున్నపుడు తాను లోకంలోకి వచ్చాడు.

పేపర్లు దిద్దుతూ కూర్చున్న భార్య ముఖంలోకి చూస్తూ నా మూలంగా నీకిన్ని కష్టాలు అన్నట్లుగా వున్నాడు. మీ మూలంగా నాకీ ఆనందం అన్నట్లుగా ఆమె దిద్దిన ప్రశ్న పత్రాలు భర్తకు అందించింది.

వినాయక్ ప్రభుత్వ కళాశాలలో లెక్చరరు. ఆమె యల్లార్జీలో టీచరు, పిల్లలిద్దరు రామచంద్రనగరు మిస్సమ్మల స్కూలులో మూడూ నాలుగు . పెద్ద వాళ్లిద్దరూ యల్లార్జీలో ఆరూ, ఏడూ. తల్లితో పోయి వస్తారు. సెకండు రోడ్డు మసీదు దగ్గిర బస్సెక్కుతారు. అక్కడే దిగుతారు. అక్కడినుంచి తపోవనం నడుస్తారు. చిన్న వాళ్లిద్దరు ఖాదరు రిక్షాలోనే వస్తారు. పొద్దున ఇల్లు వదిలిన వాళ్లు సాయంకాలానికి ఇంటికి చేరతారు. స్కూలులోనే తిండీతీర్థం. వాళ్లు స్కూల్‌లో కడుపునిండా నీళ్లు తాగుతారు. కేరియర్‌లో నీళ్లు తెచ్చుకుంటారు. ఇంటి దగ్గర నీళ్ల విషయంలో ఏ రోజు పరిస్థితి ఎలా వుంటుందో చెప్పటం కష్టం. ఇంటి నుంచి అందరినీ బయలుదేర దీసి,తాను కాలేజికి వెళ్లి, సాయంకాలం అందరికంటే ముందుగా యింటికి వచ్చి అందరినీ ఆహ్వానిస్తూ వుండేవాడు వినాయక్.

భార్యాభర్తలు నెలకింత జీతం తెచ్చుకొంటున్నారు. వాళ్లకు పెద్దగా కష్టాలు లేవు. సొంత ఇంటి సొద వాళ్ల గుండెల్ని వేదిక చేసుకొని కూర్చుండి వుండక పోతే వాళ్లు బాగానే బతుకు ఈడ్చుకొని వస్తూ వుండే వాళ్లు. ఇంటి పని పెట్టుకున్నాడు. అన్నీ కష్టాలే. అప్పులు చేయవలసి వచ్చింది. అంతటితో ఆగలేదు. బావి పని ఒకటి. అది కొరకరాని కొయ్యలాగా తయారయింది.


'నేను మంచం బైటేసుకుంటా' అన్నాడు వినాయక్. 'మీ ఇష్టం.' అంది. మంచం దిండూ దుప్పటి తీసుకు పోయి బావి దగ్గరగా వేసుకున్నాడు. లోనికి వచ్చి, నీళ్లు తాగి, పిల్లల్ని పలకరించి, పడుకో మని చెప్పి, ముద్దులు పెట్టి వెలుపలికి వచ్చాడో లేదో, వాళ్లు బిలబిలమంటూ సంచులు సరిది, మంచాలెక్కి, కబుర్లు చెప్పుకోవటం ప్రారంభమయింది. నిద్ర పొండని చెప్పి లైటు తీసేసి తలుపులు వేసి, నీళ్ల చెంబుతో భాగీరథి భర్త మంచం దగ్గరకు వచ్చి తల దగ్గర పెట్టి, కూర్చుంది. ఎవరూ ఏమీ మాట్లాడుకోలేదు. మౌనంగా వున్నారు. మౌన మహాసముద్రాలు రెండు కష్టాల చెలియలి కట్టలకు తలలు అలలై కొట్టుకున్నాయి.

వున్నట్టుండి 'పోయి పడుకో' అన్నాడు. 'పోతాను' అంది. 'ఎక్కువగా ఆలోచించవద్దు' అంది. 'బుర్ర పాడు చేసుకోవద్దు' అంది.

'సరేలే' అన్నాడు. ఆమె లోపలికి పోయి తలుపు గడియ వేసుకొంది.

'జరిగేది జరిగి తీరుతుంది' అనుకున్నాడు. అలా అనుకోవటం ఆనందంగా అనిపించింది. ఆనందం వల్ల పడుకోలేక పోయాడు. లేచి కూర్చున్నాడు.

రాత్రి పదయింది. మొదటి ఆట సినిమా చూసి వచ్చే వాళ్ల రిక్షాల బెల్లులు రెండూ మూడూ వినిపించాయి. కాలనీకి యింకా వీధిలైట్లు రాలేదు, అలికిడి అయితే కుక్కలు అరుస్తున్నాయి. జాగ్రత్తపరులు




ఎవరూ అంటూ హెచ్చరిస్తున్నారు. రిక్షాల లైట్లు కదలికలు సృష్టిస్తున్నాయి. తపోవనం నిద్రలోకి జారుకుంది. ఏ ఇంటి ముందూ పెద్దగా లైట్లు లేవు. సినీమా చూసి వచ్చిన వాళ్లు మాత్రం తలుపులు తీయటం లైట్లు వేయటం అక్కడింత, ఇక్కడింత వెలుతురు, అన్నీ మట్టిరోడ్లు. పెద్దగా శబ్దం లేదు. దాదాపు నిశ్శబ్ద నిశీధికి చైతన్య వైతాళిక స్వరం. అంత నిశ్శబ్దంలో ఆ అనారోగ్య స్వరం ఎంత ఆరోగ్యంగా సుస్వరంగా వినిపిస్తుందో!

తపోవనం విశాలమైన బయలులో పుట్టింది. ఎటు చూసినా మైళ్ల పొడుగునా అఖండంగా ఏకంగా బయలు. కనుచూపు మేరదాకా ఖాళీ భూములు. ఆ ఖాళీ ప్రదేశమంతా శూన్యం. నిశ్శబ్దం. ఎటు చూసినా చెట్టు లేదు. పుట్ట లేదు. పైరు లేదు పంట లేదు. నీరు లేదు, తడి లేదు. అఖండమైన విరామం.





నారాయణపురానికి పోయే వాళ్లు అప్పుడొకరిద్దరు, ఇపుడొకరిద్దరు పోతున్నారు. కాళ్లు నేలకు తాటిస్తూ చప్పుట్లు కొట్టుకుంటూ, ఆడుతూ పాడుతూ వెళుతున్నారు. ఈ శబ్దాలకు పురుగూ పుట్రా తప్పుకుంటాయని వాళ్ల అభిప్రాయం. మనుషులంటే వాటికి భయం. అవంటే మనుషులకు భయం. కాలనీ ఏర్పడ్డాక పాములు, తేళ్లు కనిపించటం తగ్గింది

మొదట్లో విపరీతంగా కనిపించేవి. ఈ మనుషులతో మనకెందుకనుకొని అవి దూరంగా పోయాయి.

పొలంలో పంటలు పండటం తగ్గాక పాములు, తేళ్లు ఆ పొలాల్లో విపరీతంగా పుట్టి పెరిగాయి. ఏ రాయి కదిపినా, తేలో, తేలుపిల్లో, పాంపిల్లో, మండ్రగబ్బో పకపకలాడేవి. పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అవి పరారయ్యాయి. మకాం మార్చాయి. తామున్న చోటుకు మనుషులు వచ్చి వుండటం వల్ల, వాళ్ల ముఖాలు చూస్తూ వుండలేక అవి దూరంగా వెళ్లిపోయాయి. కాలనీ ఏర్పడ్డాక నారాయణపురం పోవాలంటే రాత్రిపూట భయం లేదు. మునుపు మొదటి ఆట చూసిన వాళ్లు రెండో ఆట కూడా చూసి, తెల్లారిన తరువాతే వచ్చేవాళ్లు. ఇపుడా భయం లేదు. సైకిళ్ల మీద, బళ్ల మీద వచ్చేవాళ్లకే కష్టంలేదు. నడిచే వాళ్లకే సమస్య. ఇపుడు సినిమాకు పోయి రావటం పిల్లాట అయిపోయింది.పురుగూ పుట్ర ప్రమాదం తప్పింది గానీ, భయం పోలేదు.

తెల్లవారు జామునే నారాయణపురం నుంచి పాలు పెరుగు అనంతపురం తీసుకుని పోయేవాళ్ల రద్దీ పెరుగుతుంది. మొత్తం మీద శూన్య నిశ్శబ్దంగా వుండే చోట చలన శబ్దం వినపడసాగింది. తపోవనంలో సూర్యదీపం వుండగానే ఇల్లు చక్కబెట్టుకుని, సూర్యోదయంతో నిద్ర మేల్కొనే పరిస్థితి ఏర్పడింది. రాత్రిపూట ఎంత శబ్దంలో కూడా నిశ్శబ్దమే రాజ్యమేలుతూ వుంది.

జూన్ మొదటి వారంలో అనంతపురంలో వర్షాలు ప్రారంభమవుతాయి. మే నెలలోనే బావి పని పూర్తి




కావాలి. నీళ్లు పడ్డ తరువాత గోడ కట్టటం, గిలక వేయటం అంతా రెండు వారాల పని వుంటుంది. మేలో ఎండలెక్కువ. ఏప్రిలు నెలలోనే తవ్వకం పని అయిపోవాలి. అందుకే వినాయక్ ఒక నిర్ణయానికి వచ్చాడు. బావి పనికి మళ్లీ పూనుకోక తప్పదు. అప్పు చేశాడు. అప్పులో అప్పు. కొత్తప్పు. పాతప్పు మాట లేదు. కావలసినంత అప్పు చేశాడు. గోవిందుకు చెప్పి వచ్చాడు. తెల్లవారు జాము నుంచి మళ్ళీ పని మొదలు.

పాతికెకరాల తరికి, తోటకు సరిపడే నీళ్లుండే బావి ఎండి పోయింది. నాలుగు నిలువుల బావి. మోకాలి లోతు బావి అయింది. బావిలో బోరు వేస్తే మొలలోతు నీళ్లు వచ్చాయి. అవీ ఎంతో కాలం నిలవలేదు.

ఆ రోజుల్లో అక్కడ చీనీ తోట వుండేది. విపరీతమైన పంట వరిమడి కూడావుండేది. మంచి దిగుబడి. మంచి రాబడి. ఆరుగాలం పంట. అదనులో పంట. సెనిక్కాయ బాగా పండేది. మంచి ఔటను వచ్చేది. పాతికెకరాలకు సరిపడే నీరు పదెకరాలకు రెండెకరాలకు సరిపోతూ వచ్చి చివరకు మోట బావి వెల్లికిల పడి బొడ్డు చూపిస్తే - ఏం చేయాలి- చెమ్మలేదు. చేను ఎండి పోయింది. తరిలేదు. చీనీ చెట్లుబాగా బతికి ఆశలొదులుకొని, ఆవులించి, కళ్లు తేలేసి, నేలకొరిగి, వట్టి కట్టెలయ్యాయి. గొర్లు మేపే వాళ్లు కూడా రావటం లేదు. పుల్లలేరుకుని పోయిన వాళ్లు పోగా, చెట్లు కొట్టేశారు. మోట పీకేశారు. మిషను పీకేశారు. మిషను గది పాడు పడింది. పొలం ఆసామి అనంతపురం చేరాడు.

ఒకనాటి తోట, మరోనాటి మడి. ఆపైన చేను పాతిక ఎకరాల నిక్షేపంలాంటి భూదేవిని నారాయణప్ప అమ్మకానికి, ఆయకానికీ అప్పగించ చూశాడు. ఎవరూ ఆయకం పెట్టుకోలేదు. అమ్మకం తప్పలేదు. నారాయణప్పకు ఇద్దరు కొడుకులు. ఇద్దరూ చదువుకొన్నారు. వుద్యోగాల్లో చేరారు. పెద్దాయన ఇంజనీరింగు కాలేజీలో ప్రొఫసరు. పొలం పని చూచుకోలేడు. చిన్నాయన హైదరాబాదులో వుద్యోగం చేస్తున్నారు. పొలం పని ఎవరికీ పట్టలేదు. దానికి తోడు మోటబావి ఎండి పోయింది. ఇంకేమి వ్యవసాయం. జీతగాళ్లు లేరు. ఇక చేను ఎలాగయినా వదిలించుకోవటం, వచ్చిన కాడికి రాబట్టుకోవటం తప్పదు.

చెన్నారెడ్డి చురుకైన మనిషి ఇటుక బట్టీ నడిపి అంతో ఇంతో ఆర్జించాడు. అమ్మకానికి వచ్చిన చేను కొన్నాడు. లెక్క మాట్లాడుకున్నాడు. కొంత యిచ్చాడు. కొంత యిస్తానన్నాడు. రిజిస్టరు అయింది. పొలం చేతులు మారింది. పంట పెట్టాడు. ప్రయోజనం లేదు. బావి మొరాయించింది. వాన కలసి రాలేదు, పంటలేదు.

అనంతపురం చుట్టుపక్కలు వర్షాలు లేక నదులెండి, కాలవలెండి, చెరువులెండి, రైతులు బావుల మీద ఆధారపడ్డారు. బావులెండి, రిగ్గులేస్తే, రెండు మూడేళ్లకు అవీ ఎండిపోసాగాయి. రైతుల వ్యవసాయం దైవాధీనం అయిపోయింది. వాన వల్ల వచ్చే పంట కూడా ఏడేళ్లు ఏకబిగిని లేకపోయేసరికి చెన్నారెడ్డికి తలనొప్పి వచ్చింది. చెన్నారెడ్డి కూడా చేనును వదిలించుకొనే మార్గం వెదకసాగాడు.

ఈ పాతికెకరాలు అటు నారాయణపురానికి ఇటు అనంతపురానికి మధ్యలో వుండటంతో దాన్ని ఇళ్ల స్థలాలుగా ప్లాట్లువేయటం వుత్తమమని వూహించాడు. రాళ్లు తోలించాడు. గుళ్లు పాతించాడు. గీతలు గీయించాడు. సోలుపులు తవ్వించాడు. ప్లాట్లు వేయించాడు. పంచాయితీ ప్లాను అప్రూ చేయించాడు. అమ్మకానికి సిద్ధం చేశాడు.

చాలా కాలంగా అనంతపురంలో తమ మిషన్ పేరిట ఒక కాలనీ వుండాలని చిన్మయా మిషన్ ప్రయత్నం చేస్తూ వచ్చింది. దానికి ప్రసాద్ పేరిట తపోవనం అని నామకరణం చేశారు. మొత్తం ప్లాట్లు అన్నీ వప్పందం చేసుకున్నారు. అసలు రేటుకే కొన్నారు. లాభం వేసుకోలేదు. అయినా మిన్నులు పడ్డచోట ఇళ్ల స్థలాలేమిటి, ఇళ్లేమిటని ఎవరూ సిద్ధం కాలేదు. దాన్ని అధ్యాపకులకు మాత్రమే అని ప్రకటించారు. సాంఘిక సేవాసంస్థ ఇల్లు కట్టుకోవటానికి సహాయం కూడా చేస్తుందని ప్రకటించింది. ఫాదర్ పెర్రర్ తోడ్పాటు కలసి వచ్చింది. అపుడు అనంత పురంలోని చిన్నాచితకా అయ్యవార్లు దగ్గర్నుంచి కాలేజీ లెక్చరర్లు దాకా ఈ కాలనీలో ఇల్లు కోరుకునే వాళ్లు రోజు రోజుకూ పెరిగి పోసాగారు.

ఆ పరిస్థితుల్లో టీచరయిన భాగీరథి, లెక్చరరు అయిన వినాయక్ తపోవనంలో స్థలం, ఇల్లు సొంతదార్లు కాగలిగారు. స్వలాభం లేకుండా సేవాదృష్టితో చిన్మయ మిషన్, రాయలసీమ డెవలప్‌మెంటు ట్రస్టుసేవతో కాలనీ ఏర్పడినా చేసిన అప్పు తడిసి మోపెడయింది. అధ్యాపకుల కాలనీ తపోవనంలో నూట ముప్పై యిళ్లు. అందులో నూరు బ్రాహ్మణులవి. పాతిక వైశ్యులవి. నాలుగు శూద్రులవి. ఒక్కటే వినాయక్‌ది. మనం ఒక్కళ్లం ఇక్కడ వుండగలమా. వీళ్ల మధ్య బ్రతకగలమా అన్నది భాగీరథి సందేహం.

'బ్రతగ్గలం' అదీ సమాధానం. 'బ్రతికి తీరాలి' అదీ పట్టుదల. 'నువ్వు వీళ్లతో కలిసి బతక గలిగిన దానివి' అదీ భరోసా. 'నేనొక్కణ్ణే కాని వాణ్ణి' అదీ సంజాయిషీ. 'కానీ ఫరవాలేదు' అదీ విశ్వాసం.

వీళ్ల మధ్య మన పిల్లలు పెరగాలి. వీళ్ల శక్తియుక్తులు తెలియాలి.వీళ్ల మంచి చెడ్డలు అర్థం కావాలి. వీళ్లతో సమానులుగా సంచరించాలి. నావల్ల వీళ్లకు సాంఘిక న్యూనతా భావం రాకూడదు. సాధ్యమైతే వీళ్లకంటే గొప్పవాళ్లం అనుకోగలగాలి. అందరూ అనుకునేట్లు చేయగలగాలి, వీళ్లతో స్పర్థ మంచిది. విద్యావృద్ధి వుంటుంది. పిల్లల భవిష్యత్తు బాగుంటుంది. ఈ ఇల్లు నీకు భద్రతా భావం. నేను నీకు అండ. మనం ఇక్కడే వుంటాం. క్షణం ఆగిపోయాడు. ఈ మధ్యలో కొన్ని చిక్కులు వస్తాయి. వాటిని మనం ఎదుర్కొంటాం. ఆ విధంగా వాళ్లకు తపోవనంలో ఇల్లు ఏర్పడింది. చేరారు. సంసారం చేస్తున్నారు. కాలనీలో వచ్చిన ఒక చిక్కు నీళ్లు. బావి అవసరం ఆ విధంగా ఏర్పడింది. మంచం మీద నిద్ర పట్టక దొర్లుతున్న వినాయక్ బావి వేపు చూశాడు. ఏమీ కనిపించ లేదు. ఏమీ కనిపించదు. అయినా చూశాడు. శూన్యంలోకి చూస్తూ వుండిపోయాడు. మట్టిగుట్ట ధైర్యంగా కొండలాగా అండగా వుంది. బావిలో బండ పడితే బతుకు బండబారి పోయినట్లు బాధ పడటం వల్ల ప్రయోజనం లేదని లేచి కూర్చున్నాడు.

**(ఇంకా వుంది)**